డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
WWW.JANAMVOICE.COM
DYNAMIC JANAMVOICE
HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR


## అధికారుల నిర్లక్ష్యానికి చరమగీతం.

ప్రభుత్వ జీతాలు తీసుకుంటూ.. ప్రజలకు సేవ చేయడం మర్చిపోయారా?
మీ ఫైలు కదలడం లేదా? అధికారి కుర్చీలో ఉండటం లేదా?
సమస్య చెబితే నిర్లక్ష్య సమాధానాలా? అయితే ఇక సహించేది లేదు!

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని పాలకులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు తామే 'రాజులము' అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సామాన్యుడు తన హక్కు కోసం కార్యాలయ మెట్లు ఎక్కితే.. కనీసం మనిషిగా కూడా చూడని అహంకారం కొందరు అధికారుల్లో కనిపిస్తోంది. సంతకం పెట్టడానికి నెలలు గడిపేయడం, "రేపు రా" అంటూ సాగదీయడం, సామాన్యుడి కష్టాన్ని హేళన చేయడం నిత్యకృత్యమైంది.

**మీ సమస్యను మా దృష్టికి తీసుకురండి - నిలదీసే బాధ్యత మాది!**

మీ ప్రాంతంలో అధికారులు పని చేయడం లేదా? మీ గోడును పట్టించుకునే నాథుడే కరువయ్యారా? అయితే డైనమిక్ 'జనం వాయిస్' దినపత్రిక మీకు అండగా నిలుస్తుంది. అధికారుల అసమర్థతను, వారి నిర్లక్ష్యపు ధోరణిని పత్రికా ముఖంగా ఎండగడతాం. ఏసీ గదుల్లో కూర్చుని కాలక్షేపం చేసే అధికారుల నిద్రమత్తు వదిలిస్తాం.

**సంప్రదించండి : 8121158069**


| పెద్దపల్లి Peddapalli | ఆదివారం Sunday | 22-02-2026 22-02-2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక : 35 Issue: 35 | పేజీలు : 08 Pages: 08 | వెల :02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|


## గడువు ముగిసిన మందులివ్వడంతో ఆరు నెలల శిశువు మృతి

- హైదరాబాద్‌లో విషాద ఘటన.
- సన్ సిటీ పరిధిలో ఆసుపత్రి నిర్లక్ష్యంపై ఆరోపణలు.
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.



2

## ఎమ్మెల్యేలు అరెస్టు

- ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి అరెస్టు
- ప్రజాస్వామ్య హక్కులపై బీజేపీ ప్రశ్న






# పొట్టు పొట్టు కొట్టుకున్న బీజేపీ కాంగ్రెస్ లీడర్స్

- కామారెడ్డిలో రాజకీయ సెగలు
- బీజేపీ వర్సెస్ కాంగ్రెస్
- ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి హౌస్ అరెస్ట్.
- అరోరా భూములను కబ్జా చేశారని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ తీవ్ర ఆరోపణలు.
- మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి ప్రయాణిస్తున్న కారుపై దాడి.
- కారు అద్దాలను ధ్వంసం చేయడమే కాకుండా, ఉద్రేకంతో కారును అమాంతం బోల్తా.

**జనం వాయిస్, కామారెడ్డి నిజామాబాద్, ఫిబ్రవరి 21:**

కామారెడ్డి జిల్లా కేంద్రంలో రాజకీయ సెగలు ఒక్కసారిగా మిన్నంటాయి. భూముల కబ్జా ఆరోపణలు, ప్రత్యారోపణల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ నేతలు విసురుకున్న సవాళ్లతో పట్టణం యుద్ధవాతావరణాన్ని తలపించింది. కామారెడ్డిలో గత కొద్దిరోజులుగా సాగుతున్న భూకబ్జా ఆరోపణలు




బహిరంగ చర్చకు దారితీశాయి. బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అరోరా భూములను కబ్జా చేశారని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను సవాల్‌గా తీసుకున్న ఎమ్మెల్యే, దమ్ముంటే తన క్యాంప్ ఆఫీస్ వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన కాంగ్రెస్ శ్రేణులు చర్చకు సిద్ధమవ్వడంతో ఉద్రిక్తత మొదలైంది. ఎమ్మెల్యే సవాల్‌ను స్వీకరించి, కాంగ్రెస్ నేత, మాజీ సర్పంచ్ గిరి రెడ్డి మహేందర్ రెడ్డి తన అనుచరులతో కలిసి బీజేపీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముట్టడికి బయలుదేరారు. కాంగ్రెస్ నాయకులు నేరుగా ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు చేరుకోవడంతో అక్కడ అప్పటికే వేచి మిగతా 2 లో...

## కృత్రిమ మేధ నియంత్రణ అవసరం

- మానవ సంబంధాలు దెబ్బతినకూడదన్న వెంకయ్యనాయుడు.
- యువత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- కులం కంటే గుణం మిన్న అని హితవు.



2

## చిలీ రాజధానిలో ఘోర పేలుడు

- ద్రవ గ్యాస్ ట్రక్కు బోల్తా నలుగురు మృతి



# ఆధార్ కార్డు కాదు.

## ఇకపై ఇది ఉంటేనే మహిళలకు ఫ్రీ బస్సు..!

**జనం వాయిస్, హైదరాబాద్:**

మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళల కోసం ఆర్టీసీ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. అర్హులకే ప్రయోజనం అందేలా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ కార్డులు జారీ చేయాలని అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఫేక్ ఆధార్ కార్డులతో ప్రయాణాలు, ఇతర రాష్ట్రాల మహిళల వినియోగాన్ని అడ్డుకునేందుకే ఈ చర్యలు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకానికి నగరంలో విశేష స్పందన లభిస్తోంది. ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో సుమారు 3,200 బస్సులు నడుస్తుండగా, అందులో




దాదాపు 2 వేల ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. రోజుకు సుమారు 5 లక్షల మంది ప్రయాణికుల్లో దాదాపు 2 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. ఆక్యుపెన్సీ రేషియో కూడా 90 శాతానికి చేరింది. మిగతా 2 లో...

## కష్టపడి పనిచేసిన వారికి అవకాశాలు

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.
- టీపీసీసీ బాధ్యతలు స్వీకరించి నప్పుడు పార్టీ పరిస్థితి క్లిష్టం.
- డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం.
- భిన్నాభిప్రాయాలకు కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందని వ్యాఖ్య.



**జనం వాయిస్, వికారాబాద్, ఫిబ్రవరి 21:**

తాను టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన సమయంలో పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నాయకుడు రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత ఎదురైనా, నేతలందరినీ కలిసి తన ఆలోచనలను వివరించి వారిని ఒప్పించానని గుర్తుచేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలను వ్యక్తపరచడానికి ఎప్పటి నుంచో స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి కాంగ్రెస్‌లో లేదన్నారు. అంతర్గత విభేదాలు పార్టీ కార్యకర్తలకు అన్యాయం చేస్తాయని, అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. తెలంగాణలో పార్టీ పునరుద్ధరణ మిగతా 2 లో...

## ఆస్పత్రిలో వైద్యుల లేక

- స్వీపర్ చేత ప్రసవం.
- ఛత్తీస్‌గఢ్‌లో దారుణం శిశువు మృతి
- సమయానికి డాక్టర్, నర్స్ లేకపోవడంపై కుటుంబ సభ్యుల ఆగ్రహం
- నిర్లక్ష్యంపై విచారణకు ఆదేశాలు



2

## న్యాయ విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలలో అగ్ని ప్రమాదం

- ప్రత్యేక కమిటీ నివేదికలో సంచలన వివరాలు
- వెయ్యి నూరు దస్త్రాలు పూర్తిగా దగ్ధం
- కీలక క్రిమినల్ కేసుల ఆధారాల నష్టం



**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**

హైదరాబాద్‌లోని న్యాయ విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలలో జరిగిన అగ్ని ప్రమాదంపై నియమించిన ప్రత్యేక కమిటీ ప్రాథమిక నివేదికను విడుదల చేసింది. నాగపూర్‌కు చెందిన నిపుణుల బృందం విచారణ పూర్తి చేసి సమగ్ర వివరాలను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికలో వెలువడిన అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రయోగశాలలో నిల్వ ఉన్న వెయ్యి నూరు దస్త్రాలు పూర్తిగా దగ్ధమైనట్లు నివేదిక వెల్లడించింది. పలు కీలక క్రిమినల్ కేసులకు సంబంధించిన ఆధారాలు మంటల్లో నాశనం అయ్యాయని మిగతా 2 లో...

# ఇకపై ఇది ఉంటేనే మహిళలకు ఫ్రీ బస్సు..!

మొదటిపేజీ తరువాయి...
అయితే, ఇటీవల ఫేక్ ఆధార్ కార్డులతో ప్రయాణాలు జరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. సుమారు 25 నుంచి 30 వేల వరకు అనుమానాస్పద ప్రయాణాలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం పెరుగుతున్న నేపథ్యంలో స్మార్ట్ కార్డు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. స్మార్ట్ కార్డులను చిప్ ఆధారిత టెక్నాలజీతో రూపొందించనున్నారు. కార్డులో లబ్ధిదారుల పేరు, చిరునామా, ప్రత్యేక ఐడీ నంబర్ వంటి వివరాలు నమోదు చేస్తారు. ప్రస్తుతం ఆధార్ కార్డు చూపిస్తే టికెట్ జారీ చేస్తున్న కండక్టర్లు, కొత్త విధానంలో స్మార్ట్ కార్డును టికెట్ ఇష్యూయింగ్ మెషీన్‌తో స్వైప్ చేస్తారు. వెంటనే టికెట్ జనరేట్ అవుతుంది. దీంతో ప్రయాణ ధృవీకరణ మరింత పారదర్శకంగా ఉంటుంది. ఆధార్ కార్డులను ప్రతిసారి వెంట తీసుకెళ్లాల్సిన ఇబ్బంది తగ్గడంతో పాటు, అర్హులైన మహిళలకు సౌకర్యవంతమైన విధానం అమల్లోకి రానుంది. స్మార్ట్ కార్డు జారీ విధానం, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై త్వరలో స్పష్టత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. మహాలక్ష్మి పథకాన్ని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ఈ చర్యలు కీలకంగా మారనున్నాయి.

# కామారెడ్డిలో రాజకీయ సెగలు

మొదటిపేజీ తరువాయి...
ఉన్న బీజేపీ కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఈ ఘర్షణ హింసాత్మక రూపం దాల్చింది. ఆగ్రహంతో ఊగిపోయిన బీజేపీ కార్యకర్తలు మాజీ సర్పంచ్ మహేందర్ రెడ్డి ప్రయాణిస్తున్న కారుపై దాడికి దిగారు. కారు అద్దాలను ధ్వంసం చేయడమే కాకుండా, ఉద్రేకంతో కారును అమాంతం బోల్తా పడేయడం కలకలం రేపింది. ఈ అనూహ్య ఘటనతో అక్కడ ఒక్కసారిగా భీతావహ వాతావరణం నెలకొంది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. చర్చకు వెళ్లకుండా ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డిని ఆయన నివాసంలోనే హౌస్ అరెస్ట్ చేశారు. ఆయన బయటకు రాకుండా భారీగా పోలీసు బలగాలను మోహరించారు. పోలీసుల తీరుపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అధికార పక్షం అండతోనే పోలీసులు తనను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఘర్షణలు జరగకుండా పట్టణంలోని పలువురు ముఖ్యమైన బీజేపీ మరియు కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుంచే నేతల ఇళ్ల వద్ద నిఘా పెంచారు. ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టడంతో పాటు, అనుమానితులను పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ అరెస్టులతో రాజకీయ శ్రేణుల్లో తీవ్ర అసహనం వ్యక్తమైంది. చర్చా వేదికగా ప్రకటించిన శిశు మందిర్ పాఠశాల పరిసర ప్రాంతాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అక్కడ భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి, అపరిచిత వ్యక్తులు ఎవరినీ అటువైపు వెళ్లకుండా కట్టుదిట్టం చేశారు. వందలాది మంది పోలీసుల మోహరింపుతో ఆ ప్రాంతం కర్ఫ్యూను తలపించింది. మీడియా ప్రతినిధులను కూడా పరిమితంగానే అనుమతించారు. చర్చా వేదిక నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీ ప్రదర్శనగా బీజేపీ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వైపు వెళ్లడానికి ప్రయత్నించాయి. ఈ క్రమంలో రెండు పార్టీల కార్యకర్తలు ముఖాముఖి ఎదురుపడటంతో వాగ్వాదం మొదలై, అది కాస్తా తీవ్ర స్థాయి దాడులకు దారితీసింది. పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో ఆ ప్రాంతమంతా భయాందోళనలు నెలకొన్నాయి. ఈ గందరగోళంలో కాంగ్రెస్ నాయకుడికి చెందిన కారును బీజేపీ కార్యకర్తలు లక్ష్యంగా చేసుకున్నారు. పరిస్థితి పూర్తిగా అదుపు తప్పుతుండటంతో పోలీసులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కారు బోల్తా పడిన ఘటన తర్వాత మరింత ఘర్షణ జరగకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు ఇరు వర్గాలను చెదరగొట్టి, క్యాంప్ ఆఫీస్ పరిసరాల్లో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కామారెడ్డిలో పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది. బహిరంగ చర్చ పేరుతో మొదలైన ఈ వివాదం భౌతిక దాడుల వరకు వెళ్లడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు హౌస్ అరెస్టులు, మరోవైపు రోడ్లపై దాడులతో జిల్లా కేంద్రం స్తంభించిపోయింది. గొడవకు కారణమైన ప్రధాన వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం క్యాంప్ ఆఫీస్ పరిసరాల్లో 144 సెక్షన్ తరహా ఆంక్షలు అమలు చేస్తున్నారు.

## గడువు ముగిసిన మందులివ్వడంతో ఆరు నెలల శిశువు మృతి

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**

హైదరాబాద్ నగరంలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. గడువు ముగిసిన మందులు ఇవ్వడంతో ఆరు నెలల శిశువు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ సంఘటన సన్ సిటీ పరిధిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జరిగినట్లు సమాచారం. తమ కుమారుడికి జ్వరం రావడంతో తల్లిదండ్రులు సమీపంలోని క్రియాన్స్ ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఇచ్చిన మందుల తర్వాత శిశువు ఆరోగ్యం మరింత విషమించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పరిస్థితి క్షీణించడంతో బాలుడు ప్రాణాలు కోల్పోయినట్లు వారు వాపోయారు. ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డ మరణించాడని ఆరోపిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గడువు ముగిసిన మందులు ఇచ్చినట్లుగా ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, వైద్య రికార్డులు, మందుల నమూనాలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు. నిజానిజాలు తేలిన అనంతరం బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## కామారెడ్డి ఘటన నేపథ్యంలో ఎమ్మెల్యేలు అరెస్టు

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**

కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డిపై జరిగిన దాడి ఘటన నేపథ్యంలో ఆయనను పరామర్శించేందుకు బయలుదేరిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డిని పోలీసులు మేడ్చల్ చౌరస్తా వద్ద అడ్డుకుని అరెస్టు చేశారు. కామారెడ్డిలో జరిగిన ఘటనపై స్పందిస్తూ బాధిత ఎమ్మెల్యేను పరామర్శించేందుకు వెళ్తుండగా అక్రమంగా అడ్డుకున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. పెద్దఎత్తున పోలీసులు మోహరించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ చర్యపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. బీజేపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఖండించారు. ప్రజాప్రతినిధులకే ప్రజాస్వామ్య హక్కులు లభించని పరిస్థితి నెలకొంటే సాధారణ ప్రజలకు ఏం న్యాయం దక్కుతుందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కామారెడ్డి ఘటన నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు ఉద్రిక్తంగా మారాయి. ఈ వ్యవహారంపై మరిన్ని రాజకీయ ప్రతిస్పందనలు వెలువడే అవకాశముంది.

## కృత్రిమ మేధ నియంత్రణ అవసరం

**జనం వాయిస్, విజయవాడ, ఫిబ్రవరి 21:**



కృత్రిమ మేధను అదుపులో ఉంచుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. కృత్రిమ మేధ విస్తృతంగా పెరిగితే మానవ సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తం చేశారు. విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వినియోగం జరగకుండా కట్టడి చర్యలు తీసుకోవాలని సూచించారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాన్ని, మాతృభాషను, చదువుకున్న విద్యాసంస్థను, గురువులను ఎప్పటికీ మర్చిపోవద్దన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు గౌరవం ఇవ్వాలని, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. యువత పరిశోధనలకు, సృజనాత్మక ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సామాజిక సమస్యలపై అవగాహన పెంపొందించుకోవాలని, పూర్వీకులు అందించిన విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. భారత్ విశ్వగురువుగా ఉన్నప్పటికీ ఏ దేశంపైనా దండయాత్ర చేయలేదని గుర్తు చేశారు. భారత సత్తాను ప్రపంచ వేదికలపై మనవారు చాటుతున్నారని అభినందించారు. భవిష్యత్తులో అనేక రంగాల్లో ఉద్యోగాల స్వరూపం మారే అవకాశముందని, దీనిపై సమగ్ర చర్చ అవసరమని అన్నారు. రాజకీయాల్లో అసభ్య భాష ప్రాచుర్యం పొందుతోందని, అలాంటి వారిని సమాజం తగిన రీతిలో తిరస్కరించాలని హితవు పలికారు. కులం కంటే గుణం మిన్న అని, డిగ్రీల కంటే పరిజ్ఞానం ముఖ్యమని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. విద్యార్థులు ప్రతి విషయానికీ గూగుల్‌పై ఆధారపడకుండా స్వయంగా ఆలోచించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. బుద్ధిని వినియోగించి జ్ఞానాన్ని ఆర్జించాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు.

## చిలీ రాజధానిలో ఘోర పేలుడు

**జనం వాయిస్, శాంటియాగో, ఫిబ్రవరి 21:**

చిలీ రాజధాని శాంటియాగోలో గురువారం ద్రవ రూప గ్యాస్‌ను తరలిస్తున్న ట్రక్కు బోల్తా పడి భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పదిహేడు మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ట్రక్కు డ్రైవర్ కూడా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం ట్రక్కు అదుపు తప్పి రహదారిపై ప్రమాదానికి గురైంది. కొద్ది నిమిషాల్లోనే వాహనంలో మంటలు చెలరేగి భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. స్థానిక గ్యాస్ సంస్థకు చెందిన ఈ వాహనం ప్రమాదానికి గురైన వెంటనే మంటలు వేగంగా వ్యాపించాయి. పేలుడు తీవ్రత కారణంగా సుమారు నూట యాభై నుంచి రెండు వందల మీటర్ల పరిధిలోని యాభై వాహనాలు దెబ్బతిన్నాయి. ఎగిసిపడిన శకలాలు సమీపంలోని మూడు వ్యాపార స్థలాల ప్రాంగణాల్లో పడినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని, ఒకరి శరీరం పూర్తిగా కాలిపోయిందని స్థానిక పరిపాలన అధికారులు వెల్లడించారు. అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. రహదారిపై భారీ మంటలు ఎగిసిపడిన దృశ్యాలు భయాందోళన కలిగిస్తున్నాయి. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది. నగర భద్రతా ప్రమాణాలను పునఃసమీక్షించే అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు.

## న్యాయ విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలలో అగ్ని ప్రమాదం

మొదటిపేజీ తరువాయి... పేర్కొంది. సర్వర్లు, హార్డ్‌డిస్కులు తీవ్రంగా దెబ్బతిన్న కారణంగా డేటా రికవరీ సాధ్యమయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని ప్రత్యేక బృందం ప్రాథమికంగా అభిప్రాయపడింది. వెయ్యి నూరు కేసులకు సంబంధించిన సమాచారాన్ని పునరుద్ధరించేందుకు సాంకేతిక నిపుణులు యత్నాలు చేస్తున్నప్పటికీ, పూర్తిస్థాయిలో డేటా తిరిగి పొందడం కష్టసాధ్యమని తెలుస్తోంది. ఈ పరిణామం వల్ల కోర్టు విచారణలపై ప్రభావం పడే అవకాశం ఉందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ఘటన నేపథ్యంలో భద్రతా ప్రమాణాలపై ప్రభుత్వం సమీక్ష చేపట్టింది. ప్రయోగశాలలలో అగ్ని నిరోధక వ్యవస్థలు, డేటా భద్రతా ప్రమాణాల బలోపేతంపై చర్యలు తీసుకోవాలని సూచనలు వెలువడుతున్నాయి. పూర్తి నివేదిక కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.

## ఆస్పత్రిలో వైద్యుల లేక స్వీపర్ చేత ప్రసవం.

**జనం వాయిస్, రాయ్‌పూర్, ఫిబ్రవరి 21:**

ఆస్పత్రిలో వైద్యులు, నర్సులు అందుబాటులో లేకపోవడంతో స్వీపర్ ప్రసవం చేయడానికి ప్రయత్నించిన ఘటన ఛత్తీస్‌గఢ్‌లో వెలుగులోకి వచ్చింది. సుర్గుజా జిల్లాలోని లఖన్‌పూర్ గ్రామ కున్నీ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఈ సంఘటనలో శిశువు మృతి చెందడం విషాదాన్ని మిగిల్చింది. గౌరీ యాదవ్ అనే గర్భిణికి రాత్రి సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అక్కడ డాక్టర్, సిబ్బంది నర్సు లేరని తెలిసింది. ఈ నేపథ్యంలో అక్కడ పనిచేస్తున్న స్వీపర్ శ్యామ్ పతి గర్భిణిని పరీక్షించి చేర్పించారు. మరుసటి రోజు ఉదయం ప్రసవం చేయడానికి ప్రయత్నించే సమయంలో శిశువు అడ్డంగా తిరిగినట్లు సమాచారం. ఆ సమయంలో ఆస్పత్రికి చేరుకున్న వైద్యుడు ప్రసవం పూర్తి చేసినప్పటికీ, అప్పటికే శిశువు ప్రాణాలు కోల్పోయింది. సమయానికి వైద్యులు అందుబాటులో లేకపోవడమే ఈ విషాదానికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. డాక్టర్, నర్స్ ఉంటే తమ బిడ్డ ప్రాణాలు నిలిచేవని వాపోయారు. ఈ ఘటనపై న్యాయం చేయాలని ఆరోగ్య శాఖను డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా జిల్లా వైద్యాధికారి స్పందిస్తూ ఇది బ్రీచ్ ప్రెజెంటేషన్ కేసు అని తెలిపారు. శిశువు స్థానం సరిగా లేకపోవడంతో ప్రమాదం సంభవించిందన్నారు. రాత్రే ఇతర ఆస్పత్రికి తరలించాలని సూచించినప్పటికీ కుటుంబ సభ్యులు ఉదయం వెళ్తామని చెప్పారని వివరణ ఇచ్చారు. ఘటనపై దర్యాప్తు కోసం బ్లాక్ స్థాయి అధికారిని పంపినట్లు వెల్లడించారు. ఆ రోజు విధులకు ఒక నర్సును నియమించగా ఆమె హాజరుకాలేదని, ఇతర సిబ్బంది సెలవులో ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలో ముగ్గురు నర్సులు మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. నిర్లక్ష్యం తేలితే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బ్రీచ్ ప్రెజెంటేషన్ అంటే ప్రసవ సమయంలో శిశువు తలకు బదులుగా కాళ్లు లేదా ఇతర భాగం ముందుకు రావడం. ఇలాంటి సందర్భాల్లో సాధారణ ప్రసవం కంటే శస్త్రచికిత్స అవసరం అవుతుంది. గర్భిణులు ముందస్తు పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పాటించడం అత్యంత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## కష్టపడి పనిచేసిన వారికి అవకాశాలు

మొదటిపేజీ తరువాయి... అందరి కృషి ఫలితమని ఆయన పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షులుగా కృషి చేసిన వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చామని, టిక్కెట్లు రాని వారికి ఎమ్మెల్సీ అవకాశాలు కల్పించామని తెలిపారు. మరో అరవై మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చినట్లు వెల్లడించారు. పార్టీలో పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. మెరిట్ ఆధారంగానే అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. డీసీసీ పదవి ఎంతో విలువైనదని, దాన్ని దుర్వినియోగం చేయకూడదని హితవు పలికారు. ప్రతిభ కనబరిస్తే ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి పదవులు కూడా సాధ్యమని అన్నారు. నాయకులు ప్రజల్లో ఉండాలని సూచిస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రాహుల్ గాంధీ పాదయాత్రలను ప్రస్తావించారు. దేశం కోసం త్యాగాలు చేసిన మోతీలాల్ నెహ్రూ, జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలను స్మరించారు.

## గిగ్ వర్కర్ల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

**- యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గిగ్ వర్కర్ న్యాయ్ అభియాన్ సమావేశం.**
**- కార్మికులుగా గుర్తించాలని కేంద్రాన్ని ప్రశ్నించిన నాయకులు.**
**- ప్రత్యేక చట్టాలు, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్.**

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**

గిగ్ వర్కర్ల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో గిగ్ వర్కర్ న్యాయ్ అభియాన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కో ఇంచార్జ్ కే.ఆర్ భవ్య హాజరయ్యారు. సమావేశంలో జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిగ్ వర్కర్లను కార్మికులుగా ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. కొత్త కార్మిక కోడ్లలో గిగ్ వర్కర్లకు సంబంధించిన హామీలు ఎక్కడున్నాయని మండిపడ్డారు. ఇంధన ధరలు పెంచడం ద్వారా గిగ్ వర్కర్ల ఆదాయం తగ్గే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. స్టార్ట్ అప్ ఇండియా పేరుతో కంపెనీలకు రాయితీలు ఇస్తూ, గిగ్ వర్కర్ల భద్రతను విస్మరించడం సరికాదని ధ్వజమెత్తారు. వెంటనే గిగ్ వర్కర్లకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రస్థాయిలో గిగ్ వర్కర్ల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, రైడ్ చార్జీ హామీ, ఇంధన సబ్సిడీ కార్డు అందించాలని కోరారు. అదే విధంగా సామాజిక భద్రత హక్కులుగా పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్, బీమా సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు, జిల్లా, నియోజకవర్గ అధ్యక్షులు, స్విగ్గి, జొమాటో, ఓలా, ఊబర్, రాపిడో వంటి సంస్థల గిగ్ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# తెలంగాణ వార్తలు

## న్యాయమూర్తి కుమారుడి వివాహానికి హాజరైన ముఖ్యమంత్రి

- నూతన దంపతులను ఆశీర్వదించిన రేవంత్ రెడ్డి.
- హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో వేడుక.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఒక కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద కుమారుడు ప్రశాంత్ వివాహ శుభకార్యానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహ వేడుకలో పలువురు న్యాయవాదులు, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రముఖులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో మమేకమై శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రి ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.



## తెలంగాణ రాజ్యాధికార పార్టీలో భారీ చేరికలు

- కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఐలకు షాక్.
- కండువా కప్పి ఆహ్వానించిన పార్టీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న.
- సామాజిక న్యాయం సాధనమే లక్ష్యమని స్పష్టం.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**

ఎల్.బి నగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోల్ డివిజన్‌లో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో భారీగా చేరికలు చోటుచేసుకున్నాయి. సిపిఐ, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు తమ



పార్టీలకు రాజీనామా చేసి తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. ఈ కార్యక్రమం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్ల వాసుదేవ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కొత్తగా చేరిన నాయకులకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం సాధన, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభ్యున్నతే పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. దశాబ్దాలుగా రాజ్యాధికారాన్ని చూడని వర్గాలను అధికార స్థానాల్లో నిలబెట్టడమే తమ అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు. కొత్తగా చేరిన నాయకులు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు తమను ఆకర్షించాయని తెలిపారు. నాగోల్ డివిజన్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ నరసయ్య గౌడ్, రాష్ట్ర నాయకులు అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆందోల్‌లో పరిశ్రమల విస్తరణకు ప్రోత్సాహం

- మహిళలకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యం
- విద్య, వైద్య రంగాల కేంద్రంగా ఆందోల్ ఎదుగుదల
- సింగూర్ ప్రాజెక్టుతో సాగునీటి విస్తరణకు ప్రణాళికలు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జనం వాయిస్, సంగారెడ్డి, ఫిబ్రవరి 21:**

సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం పోసానిపేట్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్డీ డిస్టిలరీని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆందోల్ నియోజకవర్గాన్ని విద్య, వైద్య రంగాల కేంద్రంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. సింగూర్ ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం నలభై వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని, త్వరలో మరో లక్ష ఎకరాలకు నీరు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. రైతులకు స్థిరమైన నీటి వనరులు కల్పించడం ద్వారా వ్యవసాయాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు, ముఖ్యంగా మహిళలకు పెద్ద ఎత్తున



ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఆర్ఆర్డీ డిస్టిలరీ యాజమాన్యాన్ని అభినందిస్తూ, స్థానికులకు ఉపాధి కల్పించడం శ్లాఘనీయమన్నారు. భవిష్యత్తులో ఈ పరిశ్రమ మరింత విస్తరించి మరో ఐదు వందల మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ భాను ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, ఆర్ఆర్డీ డిస్టిలరీ నిర్వాహకులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామీణ గృహాల మంజూరుకు కేంద్రానికి విజ్ఞప్తి

- కనీసం ఈ ఏడాదిలో మూడు లక్షల ఇండ్లు ఇవ్వాలని అభ్యర్థన.
- పేదల సొంతింటి కల నెరవేర్చడమే రాష్ట్ర సంకల్పం.
- కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి మంత్రితో మంత్రి పొంగులేటి భేటీ.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**

గ్రామీణ ప్రాంతాల్లో గడచిన పన్నెండు సంవత్సరాలుగా ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదని పేర్కొంటూ, కనీసం ఈ ఆర్థిక సంవత్సరంలో మూడు లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కేంద్ర వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసి



ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ ప్రాంత ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామీణ గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో పేదల గృహ నిర్మాణం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, పది సంవత్సరాల్లో కేంద్రం నుంచి ఒక్క ఇల్లు కూడా తీసుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ ఏడాది దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. కేంద్రం సహకరిస్తే ఈ కార్యక్రమం మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ రెండో దశలో అధికారికంగా చేరిందని, ఇంటింటికీ నిర్వహించిన సర్వే ద్వారా పదకొండు లక్షల యాభై ఏడు వేల అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు వివరించారు. గత పన్నెండు ఏళ్ల పెండింగ్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ ఆర్థిక సంవత్సరంలో మూడు లక్షలు, వచ్చే ఏడాది మరో రెండు లక్షల ఇండ్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి వెల్లడించారు. పేదలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసం కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కొండాపూర్‌లో ఏడు ఎకరాల భూమి రక్షించిన హైడ్రా

- రూ. వెయ్యి నాలుగు వందల కోట్ల విలువైన స్థలాలకు ఫెన్సింగ్
- పార్కులు, ప్రజావసరాల స్థలాలపై ఆక్రమణల తొలగింపు
- రాజరాజేశ్వరి నగర్ నివాసితుల్లో హర్షం

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**



కొండాపూర్‌లో పార్కులు మరియు ప్రజావసరాల కోసం కేటాయించిన సుమారు ఏడు ఎకరాల భూమిని హైడ్రా రక్షించింది. ఈ భూముల విలువ సుమారు వెయ్యి నాలుగు వందల కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 78 నుంచి 93 వరకు ఉన్న రాజరాజేశ్వరి నగర్ కాలనీలో ఈ భూములు ఉన్నాయి. 1993లో గ్రామపంచాయతీ లే అవుట్‌లో భాగంగా రెండు వేల యాభై తొమ్మిది ప్లాట్లతో కాలనీ రూపొందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఐదు ఎకరాలు, పాఠశాలకు దాదాపు ఒక ఎకరం, పార్కులకు మరో ఎకరాకు పైగా, కమ్యూనిటీ హాల్ కోసం రెండు వేల ఒక వంద ఎనభై ఒక గజాలు కేటాయించారు. అయితే పాఠశాలకు కేటాయించిన భూమిలో వెయ్యి గజాల మేర అపార్టుమెంట్ నిర్మాణం జరిగిందని, కమ్యూనిటీ స్థలంలో ప్రైవేటు షాపులు, షెడ్డులు ఏర్పాటయ్యాయని గుర్తించారు. కాలనీ సంక్షేమ సంఘం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లే అవుట్ ప్రకారం పార్కులు మరియు ప్రజావసరాల స్థలాలు ఆక్రమణలకు గురైనట్లు నిర్ధారించారు. వెంటనే ఆక్రమణలను తొలగించి భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రజావసరాల స్థలాలుగా గుర్తిస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో రాజరాజేశ్వరి నగర్‌లో నివసిస్తున్న ఐదు వేల కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యను హైడ్రా పరిష్కరించిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజావసరాల కోసం కేటాయించిన భూములు ప్రజలకే అందుబాటులో ఉండేలా కాపాడతామని అధికారులు తెలిపారు.

## ఎన్టీఆర్ స్టేడియంలో రైతుబడి అగ్రి షోలో హరీష్ రావు

- రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, సబ్సిడీ అవసరమని పిలుపు
- దిగుమతుల విధానంపై కేంద్రాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి
- రైతుబంధు సకాలంలో విడుదల చేయాలని డిమాండ్

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రైతుబడి అగ్రి షో కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతుబడి రాజేందర్ రెడ్డి రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్న సేవలను అభినందించారు. దక్షిణ భారతదేశంలోనే లక్షలాది మంది అనుచరులతో వ్యవసాయ సమాచారం పంచుకుంటున్నారని పేర్కొన్నారు. సిద్ధిపేట జిల్లా పట్టుపురుగుల పెంపకంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. తీర ప్రాంతాల్లోనే పండే ఆయిల్ పామ్ సాగు ఇప్పుడు తెలంగాణలో విస్తరించిందని, గత ప్రభుత్వం దీన్ని ప్రోత్సహించిందని అన్నారు. సిద్ధిపేటలో పన్నెండు వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, రాబోయే రోజుల్లో ఇది మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఒకప్పుడు కరువు ప్రాంతంగా ఉన్న తెలంగాణలో సాగునీరు, తాగునీటి కొరత తీవ్రంగా ఉండేదని గుర్తుచేశారు. చెరువుల పునరుద్ధరణ, ప్రాజెక్టుల పూర్తి ద్వారా కరువును పారదోలినట్లు చెప్పారు. ప్రస్తుతం దేశంలోనే అధికంగా ధాన్యం పండించే రాష్ట్రంగా తెలంగాణ ఎదిగిందన్నారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అత్యవసరమని, కార్మికుల కొరత పెద్ద సమస్యగా మారిందని వివరించారు. యంత్రాలను వినియోగించినప్పుడే వ్యవసాయం లాభదాయకమవుతుందని, వ్యవసాయ పరికరాలపై సబ్సిడీ మళ్లీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రెండున్నర ఏళ్లుగా యంత్రాలపై సబ్సిడీ లేకపోవడం రైతులకు ఇబ్బందిగా మారిందని అన్నారు. అమెరికాతో ఒప్పందాల వల్ల సోయా, మక్క, పత్తి వంటి పంటలు సుంకం లేకుండా దిగుమతి అవుతున్నాయని, దీనివల్ల దేశీయ రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పామ్ ఆయిల్‌పై దిగుమతి సుంకం తగ్గించడంపై కూడా ప్రశ్నించారు. రైతుబంధు సకాలంలో విడుదల చేయాలని, రైతుల సమస్యలను ప్రభుత్వం రైతు కోణంలో ఆలోచించాలని హరీష్ రావు కోరారు.



## భూసేకరణ పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- అభివృద్ధి ప్రాజెక్టులకు వేగం పెంచాలని ఆదేశం
- ఇరిగేషన్, రైల్వే, పరిశ్రమల పార్కులపై ప్రత్యేక దృష్టి
- అధికారుల సమన్వయం కీలకం



**జనం వాయిస్, సూర్యాపేట, ఫిబ్రవరి 21:**

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఎటువంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల ఇంజనీర్లతో కలెక్టర్ ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే విస్తరణ పనులు, పరిశ్రమల పార్కుల ఏర్పాటు వంటి కీలక ప్రాజెక్టులకు భూసేకరణ అత్యంత ప్రాధాన్యమని తెలిపారు. ముఖ్యంగా పరిశ్రమల అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. పనుల్లో ఆలస్యం జరిగితే ప్రాజెక్టుల అమలు ప్రభావితమవుతుందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి శాఖ పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూసేకరణకు సంబంధించిన అడ్డంకులను వెంటనే గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలంటే భూసేకరణ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయడం కీలకమని అధికారులు పేర్కొన్నారు.

## కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ

- పెద్దపల్లి జిల్లాలో నిర్వహించనున్న ఉపాధి కార్యక్రమం.
- తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి ఆధ్వర్యంలో ఏర్పాట్లు.
- యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యమని స్పష్టం.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**

తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లాలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి బండారి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ జాబ్ మేళా ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ యువత సాధికారతే సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన ద్వారా యువతను ఆర్థికంగా బలపరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమ విజయవంతం కోసం పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లాలో నిర్వహించనున్న ఈ మెగా జాబ్ మేళా యువతకు మార్గదర్శకంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.




## రవీంద్ర భారతిలో ఘనంగా సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు

- విద్యార్థుల్లో డిజిటల్ భద్రతపై చైతన్యం కల్పించిన సైఫాబాద్ పోలీసులు.
- ఓటీపీ, క్రెడిట్ కార్డు మోసాలు, డిజిటల్ అరెస్టులపై ప్రత్యేక హెచ్చరికలు.
- చిన్నారుల నుంచే అప్రమత్తత ప్రారంభం కావాలని పిలుపు.

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**

రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యవసరమైందని భావించిన సైఫాబాద్ పోలీసులు రవీంద్ర భారతిలో విస్తృత స్థాయి సైబర్ క్రైమ్ అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యంగా చిన్నారులు, విద్యార్థులు డిజిటల్ ప్రపంచంలో అడుగుపెడుతున్న ఈ సమయంలో భద్రతా జాగ్రత్తలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. లక్డీకాపూల్‌లోని కంగారా కిడ్స్ పాఠశాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ సదస్సులో పాల్గొన్నారు. సైఫాబాద్ ఏసీపీ సంజయ్, ఎస్‌హెచ్‌ఓ ఎ. సీతయ్య, ఎస్ఐ నవీన్ మరియు ఇతర పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో



జరిగిన ఈ కార్యక్రమంలో సైబర్ నేరాల విభిన్న రూపాలను విద్యార్థులకు సరళంగా, ఉదాహరణలతో వివరించారు. ముఖ్యంగా ఓటీపీ మోసాలు, క్రెడిట్ కార్డ్ పరిమితి పెంపు పేరుతో జరిగే కాల్ మోసాలు, ఫిషింగ్ లింకులు, నకిలీ యాప్‌ల ద్వారా జరిగే మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులు వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. ఏసీపీ సంజయ్ మాట్లాడుతూ, ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీని ఎవరికీ తెలియజేయకూడదని, బ్యాంకు లేదా ఇతర సంస్థల పేరుతో వచ్చే అనుమానాస్పద కాల్స్‌ను నమ్మకూడదని సూచించారు. "మీ క్రెడిట్ కార్డ్ లిమిట్ పెంచుతాం అంగీకరించాలంటే ఒకటి లేదా రెండు నొక్కండి" వంటి కాల్స్‌కు స్పందించవద్దని హెచ్చరించారు. బ్యాంకింగ్ సేవలకు సంబంధించి సందేహాలు ఉంటే నేరుగా బ్యాంకుకు వెళ్లి అధికారులను సంప్రదించడం సురక్షిత మార్గమని తెలిపారు. చిన్నారులు సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోకూడదని సూచించారు. గేమింగ్ యాప్‌లు, ఫ్రీ ఆఫర్లు, స్కాలర్‌షిప్ పేరుతో వచ్చే లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకుండా వెంటనే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని చెప్పారు. పరీక్షలు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు వంటి పేర్లతో వచ్చే మోసపూరిత సందేశాలపై కూడా విద్యార్థులను అప్రమత్తం చేశారు. ఎలాంటి మోసానికి గురైనా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన ఉంటేనే వాటిని అరికట్టగలమని అధికారులు పేర్కొన్నారు. ఈ సదస్సును పాఠశాల యాజమాన్యం ప్రశంసించింది. చిన్న వయసులోనే డిజిటల్ భద్రతపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు కూడా ఆసక్తిగా ప్రశ్నలు అడిగి, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో ప్రజల సహకారం కీలకమని, అప్రమత్తతే ప్రధాన ఆయుధమని సైఫాబాద్ పోలీసులు స్పష్టం చేశారు.

## ఎంపీ ఈటల రాజేందర్ హౌస్ అరెస్ట్

- కామారెడ్డి ఘటన నేపథ్యంలో పోలీసుల అడ్డగింత
- ఏసీపీ సహా భారీ బందోబస్తు
- ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు

**జనం వాయిస్, హైదరాబాద్, ఫిబ్రవరి 21:**

ఎంపీ ఈటల రాజేందర్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి నివాసంపై జరిగిన దాడి నేపథ్యంలో ఆయనను పరామర్శించేందుకు కామారెడ్డి బయలుదేరిన ఈటల రాజేందర్‌ను పోలీసులు అడ్డుకున్నారు. ఏసీపీతో పాటు భారీ సంఖ్యలో పోలీసులు ఈటల నివాసానికి చేరుకుని కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. బయటకు వెళ్లకుండా నిరోధిస్తూ హౌస్ అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ చర్యపై రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేస్తున్నారని ఆరోపించారు. గుండాయిజం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ ఘటనపై మరిన్ని రాజకీయ ప్రతిస్పందనలు వెలువడే అవకాశముంది. కామారెడ్డి ఘటన నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతున్నాయి.



## కామారెడ్డి ఘటనపై భాజపా తీవ్ర ఖండన

- ఎమ్మెల్యే కార్యాలయంపై దాడి అనేది ప్రజాస్వామ్యానికి మచ్చ
- రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని విమర్శ
- ప్రశాంతత భంగం చేస్తే సహించబోమని హెచ్చరిక

**జనం వాయిస్, కామారెడ్డి, ఫిబ్రవరి 21:**

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటన ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పార్టీ నేతలు పేర్కొన్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధి కార్యాలయంపై దాడి జరగడం అత్యంత ఆందోళనకరమని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ నాయకులు తమ రాజకీయ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఈ విధమైన అల్లర్లకు పాల్పడుతున్నారని భాజపా ఆరోపించింది. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమై, దృష్టి మళ్లించేందుకు ఉద్రిక్తతలు సృష్టించడం సరికాదని విమర్శించింది. ఇలాంటి చర్యలు ప్రజల్లో అనవసర ఆందోళనలకు దారితీస్తాయని పేర్కొంది. కామారెడ్డిలో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని భాజపా నేతలు హెచ్చరించారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.



## పదవ తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

- మార్చి 14 నుండి పరీక్షలు అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
- మాల్‌ప్రాక్టీస్‌కు తావులేకుండా చర్యలు
- పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి

**జనం వాయిస్, జగిత్యాల, ఫిబ్రవరి 21:**



వచ్చేనెల మార్చి 14 నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలను పారదర్శకంగా, లోపరహితంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన పర్యవేక్షణలో ఎస్ఎస్సీ విధులు నిర్వహించే సూపరింటెండెంట్లు, విభాగాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐడిఓసి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారులు, కేంద్ర సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, వాహన ఇన్‌చార్జీలు హాజరయ్యారు. విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన ఈ పరీక్షలు ఎలాంటి లోపాలు లేకుండా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో చరవాణులు అనుమతించకూడదని, విధుల్లో ఉన్న ప్రతి అధికారి గుర్తింపు కార్డు ధరించాలన్నారు. తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, సరిపడా బెంచీలు వంటి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ప్రశాంత వాతావరణం కోసం పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ శాఖకు ఆదేశించారు. ప్రశ్నపత్రాల రవాణా, భద్రతా చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని తెలిపారు. మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు రవాణా, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. జిల్లా పరీక్షల విభాగం డైరెక్టర్ నరేందర్ మాట్లాడుతూ హాల్ టికెట్లు, ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నపత్రాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమన్నారు. ఆన్సర్ స్క్రిప్టులను సబ్జెక్టు, మీడియం, కేంద్రాల వారీగా సక్రమంగా ప్యాక్ చేసి పంపించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకింగ్ సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిఇఓ రాము సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.



# కలెక్టర్ ను కలిసిన మంథని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్.

**జనం వాయిస్, మంథని:**





పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపాలిటీకీ నూతనంగా ఎన్నిక కాబడిన చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి లు శనివారం పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ని మరియు అడిషనల్ కలెక్టర్ అరుణ శ్రీ లను కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ వైస్ చైర్మన్ లకు కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ లు అభినందనలు తెలిపారు. మంథని మున్సిపాలిటీ అభివృద్ధికై పాలకవర్గానికి సహకరించాలని ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్ వారిని కోరారు. పలు అభివృద్ధి పనుల గురించి చర్చించారు.

## ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్టాపన మహోత్సవం.

**-బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వ్యాల హరీష్ రెడ్డి విరాళం అందజేత.**

**జనం వాయిస్, గోదావరిఖని:**

గోదావరిఖని గంగానగర్ ప్రాంతంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వ్యాల హరీష్ రెడ్డి ఉదారంగా విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వ్యాల హరీష్ రెడ్డి మాట్లాడుతూ..ఆలయ అభివృద్ధి ప్రతి భక్తుడి బాధ్యత అని, ధార్మిక కార్యక్రమాలు సమాజానికి ఆధ్యాత్మిక చైతన్యం కలిగిస్తాయని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ జి బి కే ఎస్ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పోలాడి శ్రీనివాసరావు, పరశురాములు, భయపు రాజిరెడ్డి, రమేష్, కాసర్ల సురేష్, అడ్డగట్ల గోపి, నడిపెల్లి సాయి, కటకనేని శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు., ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జమ్మికుంట మున్సిపల్ నూతన చైర్మన్ ను ఘనంగా సన్మానించిన హమాలీ సంఘం నాయకులు

**జనం వాయిస్, జమ్మికుంట :**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీ లోని హమాలీ సంఘం నాయకులు నూతనంగా ఎన్నికైన మున్సిపాలిటీ చైర్మన్ ప్రశాంత్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసారు. అనంతరం వారి యొక్క సమస్యలు చైర్మన్ కి వివరించగా సానుకూలంగా స్పందించిన చైర్మన్ త్వరగా వారి యొక్క సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వారుతెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం రమేష్ , దిడ్డి రాము, గడ్డం దీక్షిత్ హమాలీ సంఘం అధ్యక్షులు జక్కుల రమేశ్,మల్లేష్, కుమార్,సుభాష్,పోచయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.



## ఇఫ్తార్ విందు ఇచ్చిన ఆరో వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్

**జనం వాయిస్ ,జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల దారు సలాం మసీదులో మొదటి శుక్రవారం సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటుచేసిన వార్డు కౌన్సిలర్ శ్రీపతి స్వర్ణలత నరేష్.పరమ పవిత్రంగా భావించే ముస్లింల ఆరాధ్యమైన రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రారంభమైన ఉపవాస దీక్షలో భాగంగా ఇటీవల నూతనంగా వార్డ్ కౌన్సిలర్ గా ఎన్నికైన శ్రీపతి స్వర్ణలత నరేష్ ముస్లిం సోదరులతో కలిసి మొదటి శుక్రవారం సందర్భంగా హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల దారు సలాం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులకు శు భాకాంక్షలు తెలియజేస్తూ నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ దంపతులు మత పెద్దల వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసి ముస్లిం సోదరులకు ఘనంగా ఏర్పాట్లు చేశారు.



# యూరియా కోసం రైతన్నల తిప్పలు రోడ్డెక్కి నిరసన

## - కరీంనగర్ జమ్మికుంట రహదారిపై ధర్నా రాస్తారోకో




**జనం వాయిస్ ,జమ్మికుంట:**

రైతులకు యూరియాను మండలం యూనిట్ కాకుండా రైతు క్లస్టరు లేదా రెవిన్యూ గ్రామాల వారిగా ఆన్ లైన్ చేసుటకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూవీణవంక మండలంలో చల్లూరు గ్రామంలో యూరియా కోసం రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా రాస్తారోకో నిర్వహించారు. తమకు యూరియా అందడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ రైతు యాప్ వల్ల రైతులకుఆన్ లైన్ ఇబ్బందుల వల్ల రైతులకు యూరియా దొరకటం లేదు.ప్రభుత్వం నూతనంగా యూరియా బస్తాల కోసం యాప్ ద్వారా ఆన్ లైన్ చేసుకుంటేనే యూరియా రైతులకు ఇస్తామని మండలం యూనిట్ గా పెట్టటం తొ ఆన్ లైన్ ఇబ్బందులు వల్ల బుకింగ్ కాక రైతులు అవస్థలు పడుతున్నారు. 450బస్తాలుఆన్ లైన్ లో పెట్టిన ఒక నిమిషం లోపే యూరియా బుకింగ్ అయ్యి రైతులకు యూరియా దొరకటం లేదు. మండలంలో26గ్రామాల రైతులు ఫోన్లతో ఆన్లైన్ చేయటం వల్ల యూరియా నిల్వ లేనట్లు చూపిస్తుంది. దీనివల్ల యూరియా సమయానికి దొరకక రైతులు రోడ్డు ఎక్కే పరిస్థితి ఎదురైందని .కావున వెంటనే వీణవంక మండలంలో యూరియా ఆన్లైన్ యాప్ ను రైతు క్లస్టర్ వారిగా నమోదు కు అవకాశం కల్పిస్తే3, 4గ్రామాలు కాబట్టి రైతులకు అన్లైన్ బుక్ అయ్యి యూరియాదొరుకుతుంది.రైతుల బాధను అర్థం చేసుకొని జిల్లా కలెక్టర్,అధికార యంత్రాంగం,వ్యవసాయాధికారులు స్పందించి రైతు వేదిక క్లస్టర్ యూనిట్ లేదా రెవెన్యూ గ్రామాల వారిగా ఆన్ లైన్ రైతు యాప్ సవరించింతే యూరియా సులభంగా దొరుకుతుందని వెంటనే యాప్ మార్పిడి చేయాలని కోరారు.

# న్యూ మిలీనియం హైస్కూల్ లో ఘనంగా 'స్పోర్ట్స్ ఫెస్ట్'.

- విద్యతోపాటు విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు అవసరం.
- మండల విద్యాధికారి మంతెన హేమలత.







**జనం వాయిస్ ,జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని న్యూ మిలీనియం హై స్కూల్ లో శనివారం "స్పోర్ట్స్ ఫెస్ట్ సంబరాలు . అత్యంత వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా న్యూ మిలీనియం హై స్కూల్, ప్లే స్కూల్ విద్యార్థులకు ఈ నెల 17 నుండి 20 వతేది వరకు వివిధ రకాల గేమ్స్ నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు మొదటి ద్వితీయ బహమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జమ్మికుంట మండల విద్యాధికారి హేమలత పాఠశాల చైర్మన్ ముసిపట్ల తిరుపతి రెడ్డి బహమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యాధికారి మంతెన హేమలత మాట్లాడుతూ విద్యార్థుల కు ఆటల పోటీలు నిర్వహించడం వలన వారిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత పెరుగుతుందని అంతేకాకుండా పట్టుదల నిబద్ధత పెరుగుతుందని తెలిపారు. పాఠశాల చైర్మన్ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ మా పాఠశాలలో చదువుతో పాటు పిల్లలకు వివిధ రకాల ఆటలు పోటీలు నిర్వహిస్తామని దీని వలన పిల్లలు ఉత్సాహంగా సంతోషంగా క్రమం తప్పకుండా పాఠశాలకు వస్తారని తెలిపారు. విద్యార్థులు కేవలం చదువు మాత్రమే కాంకుండా అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల పాటలు డాన్సులు చేస్తూ ఉత్సాహంగా కేరింతలు కొడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి విశ్వనాథ్ రెడ్డి ప్లే స్కూల్ ప్రిన్సిపాల్ వరుణ్ రెడ్డి ఇంచార్జ్ తిరుపతిరెడ్డి తోపాటు అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ లో కోరపల్లి

# విద్యార్థుల ప్రతిభ

**మండల స్థాయి బహుమతి గెలుచుకున్న విద్యార్థులు..**



**జనం వాయిస్, జమ్మికుంట:**

జమ్మికుంట మండలంలోని కోరపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు సైన్స్ టాలెంట్ టెస్ట్ లో తమ ప్రతిభను చాటారు. శనివారం నాడు జిల్లా పరిషత్ హై స్కూల్ జమ్మికుంట లో జరిగిన ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ లో మండల స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన కోరపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వి. శ్రీమాన్ తృతీయ బహుమతి పొందిన కె. కీర్తన లను జడ్. పి. హెచ్. ఎస్ కోరపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేతిరి శ్రీనివాస్ రెడ్డి భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పెండ్యం శ్రీనివాస్ పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ అవగాహన కలిగి సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకొని భవిష్యత్తులో ఉత్తమమైన సైన్స్ శాస్త్రవేత్తలు గా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. రాబోయే రోజుల్లో జిల్లాస్థాయిలో కూడా ఇదే విధంగా ఎంపికై రాష్ట్ర స్థాయిలో స్థానం పొందాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందిస్తున్నామని వారు ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ఉపాధ్యాయుల గుర్తించి వారిని ప్రోత్సహిస్తే ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని అన్నారు.

## మహాదేవపూర్ లో రోడ్డు ప్రమాదం.

**-ఇద్దరు యువకులకు గాయాలు.**

**జనం వాయిస్, భూపాలపల్లి, ఫిబ్రవరి21:**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ – కాలేశ్వరం మధ్య జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఇసుక లారీ అతివేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ద్విచక్ర వాహనం తో పాటు ఇద్దరు యువకులు రోడ్డుపై పడిపోయారు. వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారు మహారాష్ట్ర కు చెందిన ఆడే ఉజ్వల్(22), ఆడే ప్రజ్వల్(18) కొప్పురెల్లి గ్రామం, ముచ్చుర తాలూకా, గడిచి రెల్లి జిల్లా వాసులుగా గుర్తించారు. పోలీసులు లారీని స్వాధీన పరుచుకొని, డ్రైవర్ ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పాత కక్ష్యలతో వ్యక్తి దారుణ హత్య.

**జనం వాయిస్, రామగిరి:**



పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలో పట్టపగలు హత్య స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. రామగిరి మండల కేంద్రం సెంటినరీకాలనీలో శనివారం మొలుగూరి కొమురయ్య అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సెంటినరీకాలనీలోని కమ్యూనిటీహాల్ లో జరుగుతున్న పెళ్ళికి నారాయణపూర్ కు చెందిన కొమురయ్య, తమ్ముడు హాజరవగా పాత కక్షలతో వారి సమీప బంధువు ఆయనపై కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మధ్యలోకి వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేసిన కొమురయ్యకు కత్తిపోటు పడటంతో మృతి చెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకోని వివరాలు ఆరా తీస్తున్నారు.

# చింతపండు పులుపులో రుచి, వంటింటి అవిభాజ్య భాగం



తెలుగు వంటకాలలో చింతపండు స్థానం

చింతపండు తెలుగు వంటింట్లో అత్యంత ముఖ్యమైన పదార్థంగా గుర్తింపు పొందింది. పులుసులు, చారులు, పచ్చళ్లు, పులిహోర వంటి వంటకాలలో చింతపండు లేకుండా రుచి పూర్తి కాదని గృహిణులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చింత చెట్లు విస్తృతంగా పెరుగుతుండగా, సీజన్ సమయంలో చింతకాయలను సేకరించి నిల్వ ఉంచే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోందని పేర్కొంటున్నారు. పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలు చింతపండులో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు ఉండటంతో జీర్ణక్రియకు మేలు చేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. భోజనంలో పులుపు కలపడం ద్వారా ఆహారం రుచిగా మారడంతో పాటు జీర్ణక్రియను ప్రోత్సహిస్తుందని పేర్కొంటున్నారు. శరీరానికి తేలికపాటి శుభ్రత కలిగించే గుణం కూడా చింతపండుకు ఉందని చెబుతున్నారు. వ్యవసాయ పరంగా ప్రాధాన్యం చింత చెట్లు తక్కువ సంరక్షణతోనే పెరుగుతాయని రైతులు చెబుతున్నారు. దీర్ఘకాలం నిల్వ ఉండే గుణం వల్ల చింతపండు రైతులకు అదనపు ఆదాయ వనరుగా మారుతుందని పేర్కొంటున్నారు. మార్కెట్‌లో సీజన్ సమయంలో మంచి ధర లభిస్తుందని చెబుతున్నారు. పరిమిత వినియోగమే మేలు చింతపండు రుచికరమైనదే అయినప్పటికీ అధికంగా తీసుకుంటే కడుపు మంట, ఎసిడిటీ సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పరిమిత మోతాదులో వాడితే ఆరోగ్యానికి మేలు చేస్తుందని సూచిస్తున్నారు. పులుపు రుచితో పాటు ఆరోగ్య ప్రయోజనాలను అందించే చింతపండు తెలుగు వంటింట్లో ఎప్పటికీ తన ప్రత్యేక స్థానాన్ని నిలబెట్టుకుంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.





# మల్లెపువ్వులు పరిమళంలో పావిత్ర్యం, తెలుగు ఇంటి అందం

తెలుగు సంస్కృతిలో మల్లెపువ్వుల స్థానం

మల్లెపువ్వులు తెలుగు సంస్కృతిలో ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నాయని సాంస్కృతిక నిపుణులు చెబుతున్నారు. పండుగలు, వివాహాలు, శుభకార్యాల్లో మల్లెపువ్వుల వినియోగం తప్పనిసరిగా కనిపిస్తుందని పేర్కొంటున్నారు. మహిళలు జడలో మల్లెపూల దండ ధరించడం ఒక అందమైన సంప్రదాయంగా కొనసాగుతోందని చెబుతున్నారు పరిమళంలో ప్రత్యేకత మల్లెపువ్వుల సువాసన ప్రత్యేకమైనదిగా భావించబడుతుంది. ఇంట్లో మల్లెపూల పరిమళం వ్యాపిస్తే ఆ వాతావరణం మరింత ప్రశాంతంగా మారుతుందని పెద్దలు చెబుతున్నారు. సాయంత్రం వేళల్లో వికసించే ఈ పువ్వులు సహజ సుగంధ ద్రవ్యాల తయారీలో కూడా ఉపయోగిస్తారని పేర్కొంటున్నారు. ఆధ్యాత్మిక ప్రాముఖ్యం దేవాలయాల్లో పూజలలో మల్లెపువ్వులను వినియోగించడం సాధారణమని పండితులు చెబుతున్నారు. పవిత్రతకు, శుభానికి ప్రతీకగా మల్లెపువ్వులు పరిగణించబడుతున్నాయని పేర్కొంటున్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఈ పువ్వుల వినియోగం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. వ్యవసాయ పరంగా లాభదాయక మల్లెపూల సాగు రైతులకు మంచి ఆదాయ వనరుగా మారుతోందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. మార్కెట్‌లో సీజన్ సమయంలో మంచి ధర లభిస్తుందని



పేర్కొంటున్నారు. సరైన సంరక్షణతో మల్లెపూల సాగు లాభదాయకమని సూచిస్తున్నారు. పరిమళంతో పాటు సంస్కృతిని ప్రతిబింబించే మల్లెపువ్వులు తెలుగు జీవితంలో ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


# మట్టి వాసన.. చక్రాల సవ్వడి

## కాలగర్భంలో కనుమరుగవుతున్న ఎడ్ల బండి!



మన ఊరు – మన సంస్కృతి

అది ఒకప్పుడు పల్లెటూరి 'లగ్జరీ కార్'. రైతు పాలిట 'రథం'. తెల్లవారుజామునే 'కిర్రు'మనే ఆ చక్రాల చప్పుడు వినబడితే.. ఊరు నిద్రలేచేది. పొలం పనులకైనా, చుట్టాల ఇంటికి వెళ్లాలన్నా, పెళ్లి ఊరేగింపులకైనా.. ఎడ్ల బండే అప్పట్లో ఆధారం. కానీ, కాలం మారింది. వేగం పెరిగింది. నేడు ఆ చక్రాల సవ్వడి మ్యూజియాల్లోనో, పల్లెల్లో అలంకార ప్రాయంగానో మిగిలిపోతోంది.



పల్లె జీవన నాడి

ఒకప్పుడు ప్రతి రైతు ఇంట్లో కనీసం ఒక బండి ఉండేది. ఎడ్ల బండి కేవలం రవాణా సాధనం మాత్రమే కాదు, అది రైతు ఆత్మగౌరవానికి ప్రతీక.

వ్యవసాయంలో పాత్ర: పండిన పంటను కళ్ళం నుంచి ఇంటికి చేర్చాలన్నా, ఎరువును పొలానికి తీసుకెళ్లాలన్నా బండే దిక్కు.

ప్రయాణ సౌకర్యం: సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే.. బండిపై పందిరి వేసి, లోపల గడ్డి పరచి, దానిపై దుప్పటి పరిస్తే అది 'ఏసీ కోచ్' కన్నా హాయిగా ఉండేది.

అద్భుతమైన నైపుణ్యం

ఎడ్ల బండి తయారీ వెనుక ఒక పెద్ద ఇంజనీరింగ్ ఉంది. వడ్రంగి (కార్పెంటర్) చేతిలో చెక్క ముక్కలు ప్రాణం పోసుకునేవి.

చక్రాల నిర్మాణం: తుమ్మ కర్ర లేదా వేప కర్రతో చేసే ఆ చక్రాలకు 'ఇనుప కట్టు' వేసేవారు. అది దశాబ్దాల పాటు అరిగిపోకుండా ఉండేది.

కళాకృతులు: బండి గూడుపై రంగురంగుల పెయింటింగ్‌లు, ఎడ్ల కొమ్ములకు రంగులు, మెడలో గంటలు.. ఆ అందమే వేరు.

ఆధునికత దెబ్బకు.. మూలన పడ్డ బండి

ట్రాక్టర్ల రాకతో ఎడ్ల బండి ప్రాధాన్యత తగ్గిపోయింది. గంటల కొద్దీ ప్రయాణం చేసే ఓపిక నేటి తరానికి లేదు.

యంత్రీకరణ: ట్రాక్టర్లు తక్కువ సమయంలో ఎక్కువ పని చేస్తుండటంతో రైతులు వాటివైపే మొగ్గు చూపుతున్నారు.

నిర్వహణ భారం: ఎడ్లను మేపడం, వాటిని సంరక్షించడం ఖర్చుతో కూడుకున్న పని కావడంతో చాలామంది బండిని అమ్మేస్తున్నారు.

వృత్తి కళాకారుల కొరత: బండి చక్రాలు చేసే పాతతరం వడ్రంగులు ఇప్పుడు కరువయ్యారు.

నేడు ఎడ్ల బండి కేవలం సంక్రాంతి ముగ్గుల్లోనో లేదా సినిమాల్లోనో కనిపిస్తోంది. మన మూలాలను గుర్తు చేసే ఈ 'మట్టి రథం' కనుమరుగవుతుండటం బాధాకరమే అయినా, పల్లె సంస్కృతిని ప్రేమించే వారి గుండెల్లో ఆ చక్రాల చప్పుడు ఎప్పటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. మన వారసత్వ సంపదను కనీసం భావి తరాలకు గుర్తుగానైనా భద్రపరుచుకుందాం.

## టీ20 సిరీస్ భారత్ మహిళలదే



# ఆఖరి మ్యాచ్‌లో ఆసీస్ చిత్తు

మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా అడిలైడ్‌లో జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత మహిళా జట్టు ఘన విజయం సాధించింది. 17 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా మహిళా జట్టును ఓడించి సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది. 177 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 159 పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు కంగారూ బ్యాటర్లు నిలబడలేకపోయారు. ఆష్లీ గార్డ్‌నర్ 45 బంతుల్లో 57 పరుగులతో అర్ధశతకం సాధించి పోరాడినా, మిగతా బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఫోబ్ లిచ్‌ఫీల్డ్ 26, జార్జియా వాల్ 10, తహ్లియా వారేహం 12, అనెబెల్ సదర్లాండ్ 14 పరుగులు మాత్రమే చేశారు. గ్రేస్ హ్యారిస్, ఎలీస్ పెర్రీ ఒక్కో పరుగుకే వెనుదిరిగారు. బెత్ మూనీ 6, సోఫీ మోలిన్యూ 6 పరుగులతో నిరాశపరిచారు. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్, శ్రీచరణి చెరో మూడు వికెట్లు తీసి మ్యాచ్‌ను మలుపుతిప్పారు. అరుంధతీ రెడ్డి రెండు వికెట్లు సాధించగా, రేణుకా సింగ్ ఒక వికెట్ తీశారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ మహిళలు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేశారు. స్మృతి మంధాన 55 బంతుల్లో 82 పరుగులు చేసి అద్భుతంగా ఆడింది. జెమీమా రోడ్రిగ్స్ 46 బంతుల్లో 59 పరుగులతో కీలక భాగస్వామ్యం అందించింది. ఆస్ట్రేలియా బౌలర్లలో అనెబెల్ సదర్లాండ్ రెండు వికెట్లు సాధించగా, సోఫీ మోలిన్యూ, కిమ్ గాత్ తలా ఒక వికెట్ తీశారు. ఈ విజయంతో భారత మహిళా జట్టు విదేశీ నేలపై మరో సిరీస్‌ను సొంతం చేసుకుని విశ్వాసాన్ని పెంచుకుంది.

SPORT news

## టీ20 ప్రపంచకప్ బహిష్కరణపై బంగ్లా క్రికెట్‌లో దుమారం.. మాజీ సలహాదారుపై సలావుద్దీన్ సంచలన వ్యాఖ్యలు

భారత్ వేదికగా జరుగుతున్న టీ20 ప్రపంచకప్‌ను బంగ్లాదేశ్ బహిష్కరించిన నిర్ణయం ఆ దేశ క్రికెట్‌లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ వ్యవహారంపై బంగ్లాదేశ్ సీనియర్ సహాయ శిక్షకుడు మొహమ్మద్ సలావుద్దీన్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ మాజీ క్రీడా సలహాదారు ఆసిఫ్ నజ్రుల్‌పై ఘాటు విమర్శలు చేశారు. ప్రపంచకప్ బహిష్కరణ తొలుత ప్రభుత్వ నిర్ణయమని పేర్కొన్న ఆసిఫ్ నజ్రుల్, తరువాత అది ఆటగాళ్లు మరియు బోర్డు చేసిన త్యాగమని చెప్పడంపై మొహమ్మద్ సలావుద్దీన్ మండిపడ్డారు. “అది పచ్చి అబద్ధం. గౌరవనీయ ఉపాధ్యాయుడిగా ఉన్న వ్యక్తి ఇలా బహిరంగంగా అబద్ధాలు చెప్పడం ఆశ్చర్యకరం” అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయం వల్ల ఆటగాళ్లు తీవ్రమైన మానసిక వేదనకు గురయ్యారని, కొందరు ‘మానసిక కోమా’ స్థితిలోకి వెళ్లినట్టుగా తెలిపారు. “ఒక ఆటగాడు ఎన్నేళ్ల కలతో ప్రపంచకప్‌కు సిద్ధమవుతాడు. ఆ కలను ఒక్క క్షణంలో చెరిపివేయడం బాధాకరం” అని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రతా కారణాలను చూపుతూ భారత్‌లో జరిగే మ్యాచ్‌లకు వెళ్లేందుకు బంగ్లాదేశ్ ప్రభుత్వం నిరాకరించిన విషయం తెలిసిందే. అనంతరం అంతర్జాతీయ క్రికెట్ మండలి బంగ్లాదేశ్ అభ్యర్థనను తిరస్కరించి, ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను టోర్నీలో చేర్చింది. ప్రస్తుతం స్కాట్లాండ్ ప్రపంచకప్‌లో పాల్గొంటుండగా, బంగ్లాదేశ్ జట్టు దేశీయ టీ20 పోటీలపై దృష్టి సారించింది. భారత్‌తో దెబ్బతిన్న క్రికెట్ సంబంధాలను పునరుద్ధరించేందుకు బంగ్లాదేశ్ కొత్త ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించినట్టు సమాచారం.



# ‘ఒత్తిడికి లోనవ్వను..నా ఆటను మార్చుకోను’

మూడో టీ20 ప్రపంచకప్ లక్ష్యంగా ముందుకు సాగుతున్న భారత జట్టు కీలక దశకు చేరుకుంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత్ ఆదివారం అహ్మదాబాద్‌లో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. పరస్పర రికార్డులు 5-2తో భారత్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ, ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ మాత్రం జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. దూకుడైన బ్యాటింగ్‌తో భారీ స్కోర్లకు పునాది వేయగల అభిషేక్ శర్మ ఈ టోర్నీలో వరుసగా విఫలమవుతున్నాడు. లీగ్ దశలో అమెరికా, పాకిస్థాన్, నెదర్లాండ్స్‌పై సున్నాకే వెనుదిరిగాడు. దీంతో అతని స్థానంలో సంజూ శాంసన్‌ను ఆడించాలనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తనపై వస్తున్న విమర్శలకు అభిషేక్ శర్మ ఘాటుగా స్పందించాడు. “నా బ్యాటింగ్‌ను నేను ఆస్వాదిస్తున్నాను. రెండేళ్ల క్రితమే ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాను. ఒత్తిడి నాకు కొత్త కాదు. ఎత్తుపల్లాలు సహజం. కొన్ని మ్యాచ్‌ల్లో పరుగులు వస్తాయి, కొన్ని మ్యాచ్‌ల్లో రావు. అయినప్పటికీ నా ఆటను మార్చుకోను. మైదానంలో బాగా ఆడటం నా చేతుల్లోనే ఉంది” అని అభిషేక్ శర్మ స్పష్టం చేశాడు.




ఇటీవల ఆసియా కప్‌లో అద్భుత ప్రదర్శనతో టోర్నమెంట్ ఉత్తమ ఆటగాడిగా నిలిచిన అభిషేక్ శర్మ, ఈ ప్రపంచకప్‌లో మాత్రం నిరాశపరుస్తున్నాడు. అయినప్పటికీ శిక్షకుడు మోర్నీ మోర్కెల్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అతడికి మద్దతుగా నిలిచారు. సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, “అభిషేక్ శర్మ గురించి మాకు ఎలాంటి సందేహం లేదు. గత రెండేళ్లుగా జట్టుకు ఎంతో చేశాడు. ఇది సమిష్టి ఆట. ఇప్పుడు అతడికి మేము అండగా నిలవాల్సిన సమయం” అని తెలిపారు. సూపర్ ఎనిమిది దశలో అభిషేక్ శర్మ బ్యాట్ మళ్లీ మెరవాలని అభిమానులు ఆశిస్తున్నారు. దక్షిణాఫ్రికాతో జరగనున్న కీలక పోరులో అతడి ప్రదర్శనపై అందరి దృష్టి నిలిచింది.

# బీసీసీఐకి ఏదీ అనుకూలంగా లేదు.

టీ20 ప్రపంచకప్ 2026లో లీగ్ దశ ముగియడంతో ఎనిమిది జట్లు సూపర్ ఎనిమిదికి అర్హత సాధించాయి. అంతర్జాతీయ క్రికెట్ మండలి ఈ జట్లను నాలుగు చొప్పున రెండు గుంపులుగా విభజించింది. మొదటి గుంపులో భారత్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే ఉండగా.. రెండో గుంపులో న్యూజిలాండ్, పాకిస్థాన్, ఇంగ్లండ్, శ్రీలంక ఉన్నాయి. ఈ విభజనపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. భారత జట్టుకు అనుకూలంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి మార్పులు చేసిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విమర్శలకు భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ఘాటుగా స్పందించాడు. “ప్రపంచకప్‌కు భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇస్తున్నాయి. భారత్ తన మ్యాచ్‌లన్నీ భారత్‌లోనే ఆడాల్సి ఉంటుంది. శ్రీలంక, పాకిస్థాన్ తమ మ్యాచ్‌లు శ్రీలంకలోనే ఆడాలి. భారత్, పాకిస్థాన్ ఒకే గుంపులో లేకూడదని నిర్ణయించినప్పుడు భారత్ మరో గుంపులో ఉండటం సహజమే. దీనిని



అనుకూలంగా చూడటం తగదు” అని పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ వంటి బలమైన జట్లు ఒకే గుంపులో ఉండడం ఎవరికి అనుకూలమో ప్రశ్నించిన ఆయన, ఆస్ట్రేలియా బయటపడిపోతుందని, జింబాబ్వే సూపర్ ఎనిమిదికి చేరుతుందని ఎవరూ ఊహించలేదన్నారు. అందువల్ల ఈ గుంపును బలహీనంగా చిత్రీకరించడం సరైంది కాదని స్పష్టం చేశాడు. గతంలో కూడా 2007, 2009, 2010, 2012 ప్రపంచకప్‌లలో ఇలాంటి గుంపుల విభజన జరిగిందని గుర్తుచేస్తూ, మాట్లాడే ముందు విషయాన్ని పూర్తిగా తెలుసుకోవాలని ఆకాశ్ చోప్రా సూచించాడు.

# పవర్‌ఫుల్ షాట్ కొట్టిన హార్దిక్ పాండ్యా..

## తీవ్రంగా గాయపడ్డ ఇండియన్ బౌలర్

టీ20 ప్రపంచకప్‌కు సిద్ధమవుతున్న భారత జట్టును గాయాల సమస్య వెంటాడుతోంది. తాజాగా అహ్మదాబాద్‌లో జరిగిన సాధన సమయంలో కీలక ఘటన చోటుచేసుకుంది. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కొట్టిన బలమైన షాట్ నేరుగా వేగబౌలర్ మొహమ్మద్ సిరాజ్ మోకాలికి తగలడంతో ఆయన గాయపడ్డాడు. బంతి తీవ్ర వేగంతో తగలడంతో సిరాజ్ నొప్పితో ఇబ్బంది పడినట్లు జట్టు వర్గాలు తెలిపాయి. వెంటనే వైద్య సిబ్బంది పరిశీలించి చికిత్స అందించారు. టోర్నీ ప్రారంభానికి ముందు గాయపడిన హర్షిత్ రాణా స్థానంలో చివరి నిమిషంలో సిరాజ్‌కు అవకాశం లభించింది. గ్రూప్ దశలో అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసి జట్టు విజయానికి కీలక పాత్ర పోషించాడు. అనంతరం జరిగిన మ్యాచ్‌లలో జస్ప్రీత్ బుమ్రా (జస్ప్రీత్ బుమ్రా),



అర్షదీప్ సింగ్ (అర్షదీప్ సింగ్)లకు ప్రాధాన్యం ఇచ్చారు. సూపర్ ఎనిమిది దశలో వరుణ్ చక్రవర్తి కీలకంగా మారనున్నట్లు భారత బౌలింగ్ శిక్షకుడు మోర్నీ మోర్కెల్ తెలిపారు. ఆదివారం దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనున్న నేపథ్యంలో జట్టు కూర్పుపై ఆసక్తి నెలకొంది. సిరాజ్ గాయ తీవ్రతపై వైద్య బృందం నివేదిక ఇచ్చిన తరువాతే అతని అందుబాటు పై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

దినపత్రిక జనం వాయిస్ RNI NO:TGTEL/26/A0383 తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM
ఆదివారం, ఫిబ్రవరి 22, 2026




## ప్రెగ్నెన్సీ సమయంలోనే షూటింగ్..

మెగా కుటుంబ కోడలిగా గుర్తింపు పొందిన లావణ్య త్రిపాఠి వివాహానంతరం కూడా తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తూ వృత్తిపట్ల ఉన్న నిబద్ధతను చాటుకుంటోంది. ప్రస్తుతం ఆమె ప్రధాన పాత్రలో నటించిన సతీ లీలావతి చిత్రం మార్చి 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా చిత్రబృందంతో కలిసి యాంకర్ సుమ కనకాల తో నిర్వహించిన ప్రత్యేక సంభాషణలో లావణ్య తన గర్భధారణ సమయంలో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకోవడం విశేషంగా మారింది. కొన్ని నెలల క్రితమే పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఆమె, ఈ చిత్రానికి సంబంధించిన ప్రధాన చిత్రీకరణను తాను గర్భవతిగా ఉన్నప్పుడే పూర్తి చేశానని వెల్లడించింది. చిత్రీకరణ ప్రారంభమైన తర్వాత మధ్యలో విరమిస్తే నిర్మాతలకు నష్టం కలుగుతుందని భావించి, వైద్యుల హెచ్చరికలున్నప్పటికీ జాగ్రత్తలతో ముందుకు సాగానని ఆమె తెలిపింది. గర్భధారణ ప్రారంభ దశలోనే షూటింగ్ ఉండటంతో శారీరక అసౌకర్యాలు ఎక్కువగా ఉండేవని, వాంతులు వచ్చిన రోజుల్లో కూడా తక్కువ విరామంతో సెట్స్‌కు హాజరయ్యేదాన్నని చెప్పింది. మైగ్రేన్ సమస్య కారణంగా తీవ్ర తలనొప్పులు వచ్చినప్పటికీ వైద్యుల సూచనల మేరకు మాత్రలు తీసుకుని చిత్రీకరణలో పాల్గొన్నానని వెల్లడించింది. ప్రతి షెడ్యూల్ పూర్తయ్యాక ఆసుపత్రికి వెళ్లి శిశువు ఆరోగ్యం సరిగా ఉందో లేదో నిర్ధారించుకునేదాన్నని చెప్పింది. యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించాల్సిన సందర్భాల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించామని, ప్రమాదకరమైన కదలికలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొంది. నృత్య సన్నివేశాల సమయంలో కొరియోగ్రాఫర్ తన పరిస్థితిని అర్థం చేసుకుని ఒత్తిడి తక్కువగా ఉండేలా అడుగులు రూపొందించారని తెలిపింది. గర్భధారణ లక్షణాలు బయటపడకుండా దుస్తులను ప్రత్యేకంగా రూపొందించారని, కెమెరా కోణాలు కూడా జాగ్రత్తగా ఎంపిక చేశారని వివరించింది. మూడు నెలల వ్యవధిలో ప్రధాన చిత్రీకరణ పూర్తయ్యేలా బృందం సమన్వయం చేసుకుందని చెప్పింది. వైద్యులు ఎక్కువ ప్రయాణాలు చేయవద్దని సూచించినప్పటికీ చిత్రీకరణ రామోజీ ఫిలిం సిటీలో జరగడంతో ప్రతిరోజూ తెల్లవారుజామునే బయలుదేరాల్సి వచ్చేదని, అది కొంత కష్టంగా అనిపించేదని వెల్లడించింది. గర్భధారణ విషయం మొదట్లో అందరికీ తెలియకుండా ఉంచానని, తెలిసిస్తే ప్రత్యేక శ్రద్ధ చూపుతారని భావించి చెప్పలేదని తెలిపింది. అనంతరం పరిస్థితి స్పష్టమైన తర్వాత చిత్రబృందం పూర్తి మద్దతు అందించిందని చెప్పింది. కుటుంబ సభ్యులు మొదట ఆందోళన చెందినప్పటికీ, ముఖ్యంగా తన భర్త వరుణ్ తేజ్ అండగా నిలిచారని పేర్కొంది. గర్భధారణ సమయంలోనూ బాధ్యతను ముందుంచి సినిమా పూర్తి చేయాలన్న తపనతో పనిచేసిన లావణ్యపై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. మాతృత్వాన్ని ఆనందంగా ఆస్వాదిస్తూ వృత్తిపరమైన కట్టుబాట్లను సమతుల్యం చేసిన ఆమె ప్రయత్నం పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు 'సతీ లీలావతి' విడుదల కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, ఈ చిత్రం ఆమెకు మరో మంచి విజయాన్ని అందిస్తుందేమో అన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.

## 46 ఏళ్ల తర్వాత కమల్ హాసన్ రజనీకాంత్ రీయూనియన్..



భారతీయ సినీ ప్రపంచంలో అపారమైన గౌరవం సంపాదించిన ఇద్దరు దిగ్గజ నటులు కమల్ హాసన్ మరియు రజనీకాంత్ మరోసారి ఒకే చిత్రంలో కలిసి నటించబోతుండటం సినీ అభిమానుల్లో ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. దాదాపు నలభై ఆరు సంవత్సరాల తర్వాత ఈ ఇద్దరు మహానటులు తెరపై ఒకేసారి కనిపించనుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ క్రేజీ మల్టీస్టారర్‌ను అధికారికంగా ప్రకటిస్తూ చిత్రబృందం ప్రత్యేక దృశ్యాన్ని విడుదల చేసింది. ప్రస్తుతం తాత్కాలిక శీర్షికగా 'ఖఎ×=ఖ' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రానికి నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించనున్నారు. సంగీత బాధ్యతలను యువ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ నిర్వహించనుండగా, నిర్మాణాన్ని రెడ్ జెయింట్ మూవీస్ చేపట్టింది. విడుదలైన ప్రత్యేక దృశ్యంలో కమల్, రజనీ ఇద్దరూ తమదైన శైలిలో ఆకట్టుకునే లుక్‌లో కనిపిస్తూ ఒకరిపై ఒకరు పోటీ పడుతున్నట్టుగా చూపించారు. ముందుగా ఎవరి గదిలోకి ప్రవేశించాలనే సందిగ్ధంలో దర్శకుడు నిలబడటం, సంగీత దర్శకుడు రెండు వేళ్ల పద్ధతితో స్వరాన్ని ఎంచుకునే వినోదాత్మక క్షణాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. దుస్తులు, పాదరక్షలు, బెల్ట్, గడియారం, కళ్లద్దాలు వంటి ప్రతి అంశంలో ఇద్దరి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా వీడియోను రూపొందించారు. ఇద్దరూ శైలిగా నడుచుకుంటూ వచ్చి ఎదురెదురుగా నిలబడే దృశ్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రజనీ తన ప్రత్యేక శైలిలో కారు తాళాన్ని అందించడం, కమల్ దాన్ని స్వీకరించి డ్రైవింగ్ సీట్లో కూర్చోవడం అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. చివర్లో 'ఎవరు కథానాయకుడు?' అనే ప్రశ్నతో ముగిసే సన్నివేశం ఈ చిత్రంపై ఆసక్తిని పెంచుతోంది. ఇద్దరు మహానటులు గతంలో పలు చిత్రాల్లో కలిసి నటించినప్పటికీ, ఈసారి భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ ప్రత్యేక స్థానం సంపాదించనుంది. చిత్రానికి ఛాయాగ్రహణాన్ని రాజీవ్ మీనన్, కూర్పును ఆర్. నిర్మల్, కళా దర్శకత్వాన్ని డీఆర్కే కిరణ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. త్వరలోనే కథా వివరాలు, నటీనటుల జాబితా తదితర అంశాలను వెల్లడించనున్నట్లు చిత్రబృందం తెలిపింది. మొత్తం మీద ఈ రీయూనియన్ ప్రకటనతోనే బాక్సాఫీస్ వద్ద సంచలనాలకు నాంది పలికినట్లైంది. కమల్‌రజనీ కలయికను మరోసారి పెద్ద తెరపై చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## ఆ వ్యాఖ్యల బాధతో మూడు రోజులు నిద్రపోలేకపోయాను

### శివాజీ ఆవేదన

మహిళల వస్త్రధారణపై గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై ప్రముఖ నటుడు శివాజీ తాజాగా స్పందిస్తూ పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఉపయోగించిన పదాలు సరైనవి కావని, అలా మాట్లాడకూడదని ఇప్పుడు స్పష్టంగా అంగీకరించారు. తాను మాట్లాడిన తీరు అనవసర వివాదానికి దారితీసిందని ఆయన తెలిపారు. డ్రెస్సింగ్ గురించి మాట్లాడేటప్పుడు రెండు నిర్దిష్ట పదాలను ఉపయోగించడం తప్పు అని, ఆ రోజు ఎందుకు అలా మాట్లాడానో ఇప్పటికీ తనకు స్పష్టంగా అర్థం కాలేదని శివాజీ పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యల



తర్వాత తీవ్ర మానసిక సంఘర్షణకు లోనయ్యానని, దాదాపు మూడు రోజుల పాటు నిద్ర కూడా పోలేదని ఆయన వెల్లడించారు. తన మాటల వల్ల ఎవరికైనా మనస్తాపం కలిగితే క్షమాపణ కోరుతున్నానని తెలిపారు. తన కెరీర్‌లో ఎన్నో సమావేశాలు, చర్చల్లో పాల్గొన్నప్పటికీ ఎప్పుడూ అలా నోరు జారలేదని చెప్పారు. అయితే ఆ రోజు అనుకోకుండా పొరపాటు జరిగిపోయిందని, అది తనను ఇప్పటికీ బాధపెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రజాప్రతినిధి లేదా ప్రజలకు తెలిసిన వ్యక్తిగా మాట్లాడేటప్పుడు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఇప్పుడు గ్రహించానని తెలిపారు. తన తప్పును స్వయంగా ఒప్పుకుని పశ్చాత్తాపం వ్యక్తం చేయడం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది. కొందరు ఆయన నిజాయితీని అభినందిస్తుండగా, మరికొందరు మొదట్లోనే జాగ్రత్తగా మాట్లాడాల్సిందని అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ఈ ఘటన మరోసారి ప్రజా వేదికలపై మాటల ప్రభావం ఎంత పెద్దదో గుర్తు చేసింది.


## శ్రీ విష్ణు 'విష్ణు విన్యాసం' ఫిబ్రవరి 27నే థియేటర్లలోకి

కథలను నమ్మి సినిమాలు చేసే నటుల్లో ముందువరుసలో నిలిచే శ్రీ విష్ణు తాజాగా నటిస్తున్న చిత్రం 'విష్ణు విన్యాసం'. వినోద ప్రధాన చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు విడుదలకు ముందే మంచి ఆసక్తి నెలకొంది. ఒంగోలు నేపథ్యంతో సాగే ఈ కథలో శ్రీ విష్ణు 'చిన్నూ' అనే పాత్రలో కనిపించనున్నాడు.




జాతకాలు, వాస్తుపై అపారమైన నమ్మకం ఉన్న వ్యక్తిగా ఆయన చేసే విన్యాసాలు కథను ముందుకు నడిపిస్తాయి. ఇప్పటికే విడుదలైన టీజర్‌లో ఆయన యాస, సంభాషణలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రంలో నయన్ సారిక కథానాయికగా నటిస్తోంది. వినోదాన్ని ప్రధానంగా తీసుకుని తెరకెక్కిన ఈ సినిమాను మొదట ఫిబ్రవరి 28న విడుదల చేయాలని ప్రకటించారు. అయితే తాజా సమాచారం ప్రకారం ఒక రోజు ముందుగానే, ఫిబ్రవరి 27న థియేటర్లలోకి తీసుకురానున్నారు. "జాతకం ప్రకారం ముందే నవ్వుల వర్షం" అంటూ చిత్రబృందం కొత్త విడుదల తేదీని ప్రకటించింది. ప్రేక్షకుల జాతకంలో నిరంతర వినోద దోషం మొదలవుతుందనే ఆకర్షణీయమైన వ్యాఖ్యతో ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఈ చిత్రానికి రాధన్ సంగీతాన్ని అందిస్తున్నారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ పతాకంపై సుమంత్ నాయుడు జి నిర్మిస్తున్నారు. ఇదే రోజున విడుదల కావాల్సిన శ్రీ విష్ణు నటించిన 'మృత్యుంజయ్' చిత్రం మాత్రం మార్చి 6కు వాయిదా పడింది. దీంతో ఫిబ్రవరి 27న థియేటర్లలో నవ్వుల సందడి ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

## జ్యోతిక ఫిట్‌నెస్ రహస్యాలేమిటి..?



నటి జ్యోతిక కొన్ని సంవత్సరాల క్రితం క్రమబద్ధమైన వ్యాయామం, సమతుల్య ఆహారంతో బరువు తగ్గి అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం 47 ఏళ్ల వయసులోనూ ఆమె తన శరీరాకృతిని, ఆరోగ్యాన్ని అదే క్రమశిక్షణతో కాపాడుకుంటూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. తాజాగా ఆమె అనుసరిస్తున్న ఆహార నియమాలు, వ్యాయామ విధానాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారి తీసాయి. జ్యోతిక ప్రతిరోజూ వ్యాయామాన్ని తప్పనిసరిగా చేస్తుంది. ఒకే విధమైన వ్యాయామాలను పదేపదే చేయకుండా వాటిలో మార్పులు చేస్తూ శరీరాన్ని సవాల్‌కు గురిచేస్తుంది. ఇటీవల ఆమె చేసిన ఒక ప్రత్యేక వ్యాయామ విధానం అందరి దృష్టిని ఆకర్షించింది. అది ప్లాంక్ విధానం. అయితే సాధారణంగా చేసే విధంగా కాకుండా బరువుతో కూడిన ప్లాంక్ సాధనను ఆమె అభ్యసిస్తోంది. ఈ విధానంలో శరీర మధ్యభాగాన్ని బరువుపై సమతుల్యంగా ఉంచి, మొత్తం శరీరాన్ని ఒక సూటి గీతలా నిలబెట్టడం అవసరం. దీని వల్ల నడుము కింద భాగం బలపడటంతో పాటు శరీరమంతా దృఢంగా మారుతుందని ఆమె శిక్షణ గురువు వివరించారు. అయితే ఈ విధమైన వ్యాయామాన్ని నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే చేయాలని సూచిస్తున్నారు. వెన్నునొప్పి లేదా ఇతర సమస్యలు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని హెచ్చరిస్తున్నారు. క్రమశిక్షణ, నియమిత సాధన ఉంటేనే ఈ వ్యాయామం ఫలితాలను ఇస్తుందని చెబుతున్నారు. "ఆరోగ్యకరమైన జీవితం అంటే ప్రతిదీ సమతుల్యం చేసుకోవడమే. బరువు తగ్గడానికి ఆహారం ఎంత ముఖ్యమో, శారీరక బలం కూడా అంతే ముఖ్యం" అని జ్యోతిక గతంలో ఇచ్చిన సంభాషణల్లో పేర్కొన్నారు. తాను కఠిన ఆహార నియమాల కంటే సమతుల్యమైన, పోషక విలువలున్న ఆహారాన్ని ప్రాధాన్యంగా తీసుకుంటానని తెలిపారు.కొంతకాలం సినిమాలకు విరామం ఇచ్చిన జ్యోతిక, ఇప్పుడు వరుస చిత్రాలతో మళ్లీ బిజీగా మారింది. ఒకవైపు చిత్రీకరణలతో బిజీగా ఉండగా, మరోవైపు సామాజిక మాధ్యమాల్లో తన ఫిట్‌నెస్ ఫొటోలు, వీడియోలను పంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటోంది. వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, క్రమశిక్షణతో జీవిస్తే ఏ వయసులోనైనా ఆరోగ్యంగా, అందంగా ఉండవచ్చని జ్యోతిక తన జీవనశైలితో నిరూపిస్తోంది.

Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, DYNAMIC JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: honeyassociatesmnt@gmail.com